

ఆడపిల్లగా పుట్టడమే నేరమా..?



కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన ఘటన దారుణం. ప్రభుత్వాలు ఎన్ని చెప్తున్నా, ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. సమాజంలో ఆడపిల్లగా పుట్టడమే నేరమాననే ఆవేదన కలుగుతోంది. ఇలాంటి ఘటనలు జరగకుండా వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. దోషులను తక్షణమే శిక్షించాలి.

– దివ్య, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్, సర్వజన ఆస్పత్రి

తప్పు చేయాలన్న ఆలోచనే రాకూడదు



సమాజంలో మహిళలు ఏదో ఒక రూపంలో దాడులకు గురవుతూనే ఉన్నారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడే వారిని అత్యంత కఠినంగా శిక్షించాలి. ఇలాంటి శిక్షలను చూసి తప్పు చేయాలంటే భయపడేలా చట్టాలను తీసుకురావాలి. వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– దీప్తి, జూనియర్ డాక్టర్

ప్రత్యేక చట్టంతోనే రక్షణ



మహిళలు, మహిళా డాక్టర్లపై వేధింపులకు పాల్పడే వారిని శిక్షించేందుకు ఇప్పుడున్న చట్టాలు చాలవు. మృగాళ్ల తరుముతుంటే యాప్‌లో వివరాలను నమోదు చేసేంత సమయం ఉండకపోవచ్చు. ఇలాంటి అకృత్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. పాఠశాల స్థాయి నుంచే బాలికలకు మానసిక ధైర్యంతో పాటు కరాటేను నేర్పించాలి.

– ప్రశాంతి, డాక్టర్, జీజీహెచ్

క్లుప్తంగా

ఎస్సై బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన జిలానీ

ఆత్మకూరు : ఆత్మకూరు ఎస్సైగా ఎస్‌కే జిలానీ శనివారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న కె.ముత్యాలరావు నెల్లూరుకు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎస్‌కే జిలానీ బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్సైను పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

పాదచారుడిని ఢీకొన్న బైక్

మర్రిపాడు : మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై నడిచి వెళ్తున్న వ్యక్తిని ఓ ద్విచక్ర వాహనం ఢీకొంది. వివరాల్లోకి వెళ్తే.. చెన్నయ్య అనే వ్యక్తి టోల్ ప్లాజా వద్ద నుంచి దాబా వైపునకు వెళ్తున్నాడు, ఆ క్రమంలో మర్రిపాడు నుంచి ఆత్మకూరు వైపు వస్తున్న ద్విచక్రవాహనం చెన్నయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాదచారుడికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పోలీస్ సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు చోరీ

- నెలన్నర తరువాత కేసు నమోదు

కావలి : గత నెలలో జరిగిన బంగారు చోరీపై కావలి వన్ టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కావలి పట్టణంలోని పుల్లారెడ్డి నగర్‌కు చెందిన అపర్ణ అనే మహిళకు చెందిన 37 గ్రాముల బంగారు జూలై 9వ తేదీ చోరీకి గురైంది. కాగా ఉన్నతాధికారుల ఆదేశాలతో బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు.

మాజీ సర్పంచ్ మృతి

ఆత్మకూరు : ఆత్మకూరు సర్పంచ్‌గా (1988–93) పనిచేసిన గుండాల హనుమాన్‌రెడ్డి (76) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందారు. ఆయన సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఆత్మకూరు పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఆక్రమణలు తొలగించి పంచాయతీ స్థలాలను రక్షించారు. ఆయన కుమారుడు డాక్టర్ అనిల్‌కృష్ణారెడ్డి నెల్లూరులోని మెడికవర్ (సింహపురి వైద్యశాల) హాస్పిటల్ ఎండీగా ఉన్నారు. హనుమాన్‌రెడ్డి మృతి పట్ల పట్టణంలోని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

పశువులకు టీకాలు వేయించాలి

వరికుంటపాడు : పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని వరికుంటపాడు పంచాయతీ సర్పంచ్ కె.దిలీప్‌కుమార్ కోరారు. గ్రామంలో పశుసంవర్థక శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటూ టీకాలు తప్పక వేయించాలని సూచించారు.

క్రాకుటూరులో వైద్యశిబిరం

కలిగిరి : మండలంలోని క్రాకుటూరు పంచాయతీలో కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి పర్యవేక్షణలో వైద్యశిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. జ్వర బాధితులకు వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

నగదు ప్రోత్సాహకాల పంపిణీ



మర్రిపాడు : స్థానిక ఉన్నత పాఠశాలలో గత సంవత్సరంలో పదో తరగతిలో ఉన్నతంగా రాణించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను శనివారం అందించారు. పాఠశాల స్థాయిలో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించిన స్నేహిత, వర్షితలకు రూ.10 వేలు, రూ.5 వేల వంతున నగదును కటారి సుధాకర్, మౌనిక దంపతులు ఎంఈఓ–2 ధనలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వారి కుమార్తె శ్రీయాన్షి జన్మదినం సందర్భంగా శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేకపాటికి ధన్యవాదాలు

సంగం : తమ గ్రామంలో మసీదు నిర్మాణం కోసం రూ.10 లక్షలు అందజేసిన ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని సంగం మండలం జెండాదిబ్బ ముస్లిం మైనారిటీ నాయకులు పేర్కొన్నారు. ఈ క్రమంలో మసీదు స్లాబు నిర్మాణం చేపట్టడంతో మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. ఉపసర్పంచ్ నరేష్ గుప్తా, కో–ఆప్షన్ సభ్యులు మన్సూర్, ఖాదర్‌బాషా, సర్దార్ పాల్గొన్నారు.

అల్లూరు గొంతెండుతోంది



- తాగునీరు అందక ప్రజల అవస్థలు
- పలుచోట్ల పైప్‌లైన్లకు మరమ్మతులు
- పట్టించుకోని అధికారులు



అల్లూరు సమ్మర్ స్టోరేజీ



బస్టాండ్ సెంటర్‌లో వృథాగా పోతున్న నీరు

అల్లూరు : అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీరు అందక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పేరుకే నగర పంచాయతీ.. అయితే కనీస సౌకర్యాల కల్పనలో అధికార యంత్రాంగం తీవ్రస్థాయిలో విఫలమవుతోంది. ప్రజల అవసరాల మేరకు ప్రతిరోజు తాగునీటిని అందించాల్సి ఉండగా, కేవలం రెండు రోజులకు ఒకసారి నీటిని విడుదల చేస్తున్నారు. అది కూడా కేవలం 5 నుంచి పది నిమిషాలు మాత్రమే నీటిని అందిస్తున్నారు. అందులోనూ కొన్ని ప్రాంతాల్లో కలుషిత నీటిని విడుదల చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

సరఫరా ఇలా..

అల్లూరు నగర పంచాయతీకి ఐదు ట్యాంకుల ద్వారా నీటిని అందిస్తారు. అల్లూరు బీసీ కాలనీ ట్యాంకు ద్వారా దాదాపు 15 కాలనీలకు, గోగులపల్లి రూట్ సెంటర్‌లోని ట్యాంకు ద్వారా దాదాపు 10 కాలనీలకు, పేటసత్రంలోని ట్యాంకు ద్వారా 5 కాలనీలకు, ఉద్దీవగుంట ట్యాంకు ద్వారా 2 కాలనీలకు, సింగారెడ్డి దిన్నె ట్యాంకు ద్వారా 5 కాలనీలకు నీటిని సరఫరా చేస్తారు. ఈ ట్యాంకులను నింపేందుకు అల్లూరు చెర్లో సంఘం వద్ద ఉన్న మోటార్ల ద్వారా కొంత, సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారా కొంత నీటిని నింపి కాలనీలకు అందిస్తారు.

అధికారుల పర్యవేక్షణ శూన్యం

అధికారుల పర్యవేక్షణ లోపంతోనే నగర పంచాయతీలో తాగునీటి సమస్య ఏర్పడింది. మోటార్ల ద్వారా ట్యాంకులను నీరు అందుతుంది. అయితే సమ్మర్ స్టోరేజీ నుంచి కొంత కాలంగా ట్యాంకులకు నీరు అందడం లేదు. సమ్మర్ స్టోరేజీ నుంచి ట్యాంకులకు వచ్చే పైప్‌లైన్లు కొన్ని ప్రాంతాల్లో దెబ్బతినడంతో ఈ సమస్య ఏర్పడింది. కేవలం మోటార్ల ద్వారా ట్యాంకులను నింపడం కష్టం కావడంతో నగర పంచాయతీలో పలు కాలనీలకు రోజుమార్చి రోజు కేవలం 5–10 నిమిషాలు మాత్రమే నీటిని అందిస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి సకాలంలో పైప్‌లైన్లకు మరమ్మతులు చేసుంటే ఈ సమస్య వచ్చేది కాదు.

పన్నుల వసూళ్లలో దూకుడు

అల్లూరు నగర పంచాయతీలో మొత్తం 5,565 నివాసాలు ఉండగా, దాదాపు 30 వేల జనాభా ఉన్నారు. అందులో 18 ఎస్టీ కాలనీలు ఉన్నాయి. ఈ క్రమంలో సంవత్సరానికి ఇంటి పన్నులు, నీటి పన్నుల ద్వారా దాదాపు రూ.1.30 కోట్లు వసూలు చేస్తున్నారు. ఇంత స్థాయిలో పన్నులను వసూలు చేస్తున్నా మౌలిక వసతుల కల్పనలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రతిరోజూ నీటిని అందించాలి



సకాలంలో తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గత నాలుగు నెలలుగా రోజు మార్చి రోజు కేవలం 5 నిమిషాలే నీటిని విడుదల చేస్తున్నారు. ఇకనైనా ప్రతిరోజు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– షేక్ షకీలా, అల్లూరు

నీటిని కొనుగోలు చేస్తున్నాం



మాకు తాగునీరు సరిగ్గా రాకపోవడంతో బయట నీటిని కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. కేవలం తాగునీటికే కాకుండా ఇతర అవసరాలకు కూడా సరిపడా నీటిని విడుదల చేయడం లేదు. వారు అందించే నీటిని 2–3 బిందెలకు నింపుకునేలోపు ఆగిపోతున్నాయి. గతంలో కూడా నీటి సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– దోనిపూడి పద్మావతి, అల్లూరు

ధర్నాకు దిగుతాం



గుక్కెడు నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. పంచాయతీ కుళాయి ద్వారా నీరు రాకపోవడంతో బయట నీటిని కొనుగోలు చేస్తున్నాం. అధికారులు స్పందించి రోజూ తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోండి. లేకుంటే నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతాం.

– బి.రత్తమ్మ, అల్లూరు

యూత్‌ఫెస్ట్‌లో సంగం విద్యార్థుల ప్రతిభ



సంగం : జిల్లా యూత్‌ఫెస్ట్–2024 క్విజ్ పోటీల్లో సంగం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పదో తరగతి విద్యార్థిని సోఫియా, తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రణీక్ష ద్వితీయస్థానం సాధించారు. వీరికి జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

అల్లూరు : మండల పరిధిలోని నార్తుమోపూరు గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమృతధార పేరుతో వాటర్ ప్లాంట్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి శనివారం ప్రారంభించారు. వేమిరెడ్డి కోటారెడ్డి, బీద గిరిధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

వరికుంటపాడు : మండలంలోని వేంపాడులో సర్వే నంబర్ 78–1లో 6.08 ఎకరాల దేవదాయశాఖ భూములను అధికార పార్టీకి చెందిన నేతలు శనివారం ఆక్రమించారు. దీనిపై ఆలయ ఈఓ జి.నరసింహారావు పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

వెంకయ్యస్వామికి ఆరాధనోత్సవాలు



చేజర్ల : గాలిపాళెం వెంకయ్యస్వామి ఆలయం వద్ద కోలాట ప్రదర్శన



సంగం : విశేషాలంకారంలో వెంకయ్యస్వామి



ఆత్మకూరురూరల్ : విశేష పూజల్లో పాల్గొన్న భక్తులు

చేజర్ల : మండలంలోని గాలిపాళెంలో ఉన్న వెంకయ్యస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, లలిత సహస్ర నామార్చన చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అదేవిధంగా మండలంలోని పులనీళ్లపల్లి, నాగులవెలటూరులో వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించారు.

- **ఆత్మకూరురూరల్ :** మండలంలోని దేపూరులో భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతసేవతో ప్రారంభించి స్వామివారికి అభిషేకాలు, విశేషాలంకరణ చేశారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. శంకర్‌నగరం గ్రామానికి చెందిన భజన బృందం తలపెట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆశ్రమ కమిటీ నిర్వాహకులు కొల్లా ఆదిశేషయ్య నాయుడు, పెంచలయ్య నాయుడు, దొడ్ల సుమన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ రావెళ్ల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ వెంకట సుబ్బయ్య, తూమాటి శేషయ్య, తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.
- **సంగం :** మండలంలోని పలు వెంకయ్యస్వామి ఆలయాల్లో ఆరాధన మహోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రమైన సంగంలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం విశేష పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం భజన కార్యక్రమం జరిగింది.

హామీల అమలు ఎప్పుడు?



ఐ లవ్ కావలి సెల్ఫీ ప్రదేశం వద్ద రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- కక్ష్య సాధింపులు మానుకోవాలి
- ఎమ్మెల్యేకు వెంకటకృష్ణారెడ్డికి రామిరెడ్డి హితవు

కావలి : ఎమ్మెల్యేగా గెలుపొందిన దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలే గానీ, వ్యక్తిగత కక్ష్యలు తీర్చుకోవడానికి ఎమ్మెల్యే పదవిని వాడుకోవడం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 అడుగుల జాతీయ జెండా, జాతీయ నాయకుల చిత్రమాలిక, ఐ లవ్ కావలి ప్రదేశాన్ని ఆయన శనివారం సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కావలి చెందిన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను ఏర్పాటు చేయకపోవడం, ఎమ్మెల్సీలుగా సేవలు అందించిన కావలికి చెందిన మధురాంతకం మాధవరావు ఫొటోను విస్మరించడం బాధాకరమన్నారు. కావలిలో అక్రమ లేఅవుట్ అంటూ వైఎస్సార్‌సీపీ నాయకుల పేర్లతో కూడిన జాబితాను విడుదల చేశారని, ఆ జాబితాలో టీడీపీ, బీజేపీ నాయకులకు చెందిన లేఅవుట్‌ల ప్రస్తావన ఎందుకు లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి నివాసం ఉంటున్న చోట లేఅవుట్ వేసి ప్లాట్ల విక్రయాలు చేశారని, అలాగే కావలి పట్టణంలోని బాలకృష్ణారెడ్డి ప్రాంతంలో, రేణిగుంట, సూళ్లూరుపేటలో కూడా చేస్తున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి అనుమతులు ఉన్నాయా.. అని నిలదీశారు. తుమ్మలపెంట రోడ్డులో, కావలి పట్టణం నుంచి జాతీయ రహదారి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, తుమ్మలపెంట గ్రామ కూడలిలో నాలుగు రోడ్లకు అనువుగా నిర్మాణ పనులు చేయాలని, ఈ అంశాలను రోడ్డు విస్తరణ పనుల్లో పొందుపరిచామని గుర్తుచేశారు. అలాగే కావలి ట్రంక్‌రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం జరగకుండా వేగవంతం చేయాలని, ఒంగోలు వైపు వెళ్లే రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణానికి రోడ్డుకు రెండు వైపుల అంచున కాకుండా, రోడ్డు స్థలాన్ని వదిలేసి నిర్మాణం చేయడం వల్ల రాబోయే రోజుల్లో అనేక సమస్యలు వస్తాయని తెలిపారు. ఆయన వెంట కావలి ఎంపీపీ కొండమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కనమర్లపూడి వెంకట నారాయణ, మద్దిబోయిన వీరరఘు యాదవ్, గంధం ప్రసన్నాంజనేయులు, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, గుర్రం వెంకటేశ్వర్లు, కొమారి రాజు, గుడ్లూరు మాల్యాద్రి, వేగూరి చిన పుల్లయ్య, దామిశెట్టి సుధీర్ నాయుడు, షేక్ నాయబ్ రసూల్, మునీర్, అక్కిలిగుంట మాల్యాద్రి, తోట శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి



అల్లూరు : శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



ఆత్మకూరు : ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

ఆత్మకూరు : పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు రాధా, కృష్ణులు వేషాలు వేసి పాటలు పాడించారు. చిన్న వయస్సు నుంచే పిల్లలకు పండగల ప్రాముఖ్యత, చరిత్రను కథల రూపంలో చెబుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో షకీలా, విజయమ్మ పాల్గొన్నారు.

- **అల్లూరు :** మండల పరిధిలోని మోపూర్‌లో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ కావలి శివ, డైరెక్టర్ ఖాజారంహతుల్లా పాల్గొన్నారు.